అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
సోమవారం 13 మార్చి 2023

పనుల పరిశీలన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని ఎల్లమ్మ గల్లీ లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన ఐదు లక్షల నిధుల ద్వారా చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణం పనులను ఆదివారం సర్పంచ్ సురేష్ ఉప సర్పంచ్ విట్టల్ ఆ గల్లి వార్డ్ సభ్యులు భైరువార్ నాగేష్ రోడ్డు నిర్మాణం గుత్తే దార్ హనుమంతరావు పటేల్ పరిశీలించారు. పనులు జరగాలని సర్పంచ్ గుత్తేదార్‌కు సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినందుకు వార్డు సభ్యునికి గ్రామ సర్పంచ్‌కు గల్లి ప్రజలు అభినందిస్తున్నారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రామారెడ్డి అడవి ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను ఫారెస్ట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... రాత్రి నుండి ఉదయం వరకు పెట్రోలింగ్ చేస్తుండగా రామారెడ్డి అడవి శివారు ప్రాంతంలో ట్రాక్టర్‌తో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని మాచారెడ్డి రేంజ్ కార్యాలయానికి ట్రాక్టర్ను తరలించినట్లు ఆయన తెలిపారు.



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మంత్రి కేటీఆర్ పర్యటన ఖరారు

- 15న పిట్లం-నిజాంసాగర్‌కు రాక

నవతెలంగాణ-పిట్లం



వాయిదా పడ్డ మంత్రి కేటీఆర్ పర్యటన మళ్లీ ఖరారు అయింది. ఈ నెల 15వ తేదీనా పిట్లం, నిజాంసాగర్ మండలాల్లో పర్యటించనున్నట్టు బీఆర్ఎస్ పిట్లం మండల అధ్యక్షులు వాసవి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13న ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించవలసి ఉండగా ఎమ్మెల్సీ కవిత ఈడీ నోటీసులు, విచారణ నేపథ్యంలో వాయిదా పడింది. తిరిగి ఈ నెల 15న ఖరారు అయినట్లు ఆయన వెల్లడించారు.

మంత్రి చేతుల మీదుగా 25వేల కోట్ల రూపాయలతో నిజాంసాగర్ మండలంలోని నిర్మించిన పెద్దపులు వంతెన ప్రారంభోత్సవం అనంతరం నిజాంసాగర్ మండలంలోని కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన అతిథి గృహాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరం రూ.476 కోట్లతో నిర్మించనున్న నాగమడుగు ప్రాజెక్టు మత్తడి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం పిట్లంలో భారీ బహిరంగ సభలో పాల్గొంటారని, కావున పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులు, ప్రజలు, టీఆర్ఎస్ సానుభూతిపరులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యువకులకు అండగా ఉంటాను

నవతెలంగాణ-రామారెడ్డి

యువతకు అండగా ఉంటానని, ఎలాంటి సమస్యలు వచ్చిన, సమస్య పరిష్కారానికి ముందు ఉంటానని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తనయుడు, బి ఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకులు గంప శశాంక్ అన్నారు. మండలంలోని సింగరాయపల్లిలో యువజన ఆత్మీయ సమ్మేళనంలో ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు అధికం నరస గౌడ్ మాట్లాడుతూ.. గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి జరుగుతున్నాయని, యువతకు చేదోడువాదోడుగా ఉంటూ, ఏ సమస్య ఉన్న నేనున్నానని భరోసా కల్పిస్తున్న గంప శశాంక్ కు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామం తరపున శశాంక్ కు శాలువాతో సన్మానించి, జ్ఞాపకం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెన్నం భాను రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గడ్డం రవీందర్ రెడ్డి, నాయకులు చెన్నం యాదవ రెడ్డి, సత్య గౌడ్, తోట భూమయ్య, సాయి రెడ్డి, సొంటె మహేష్, యువత తదితరులు పాల్గొన్నారు.



గంప శశాంక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎత్తిపోతున్న బోర్లు.. ఎండుతున్న పంటలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- గరిష్టంగా తాడ్వాయిలో 31.8 మీటర్ల లోతులో నీరు

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట్‌లో బోరు ఎత్తిపోయడంతో నీరు లేక ఎండుతున్న వరి పైరు

వేసవికంటే ముందే ఎండలు ముదరడంతో భూ గర్భ జలాలు లోలోతుల్లోకి వెళ్తున్నాయి. గతేడాది కంటే వేగంగా భూ గర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోరు బావులు ఎత్తిపోతుండగా.. పంటలు ఎండిపోతున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా గరిష్టంగా తాడ్వాయిలో 31.8 మీటర్ల లోతుల్లో భూ గర్భ జలాలు ఉండగా, కనిష్టంగా నిజాంసాగర్ మండలంలో 1.18 మీటర్ల ఎత్తులో నీళ్ల ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 68 సెంటర్ల నుంచి వివరాలు సేకరించగా.. సగటు 10.64 మీటర్ల లోతులో భూ గర్భ జలాలు ఉన్నట్టు జిల్లా భూగర్భ జలశాఖ నివేదికలో పేర్కొంది. కాగా భూ గర్భ జలాలు అడుగంటుతుండటంతో బోరుబావుల మీద ఆధారపడి సాగు చేసుకుంటున్న రైతులు దిగాలు చెందుతున్నారు. బోర్లు ఎత్తిపోతుండటంతో కలుపు దశలోనే వరి పంట పొలాలు బీటలు గా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 4 లక్షల 8 వేల 323 ఎకరాల్లో వివిర రకాల పంటలు సాగు చేపట్టగా.. అందులో ప్రధానంగా 2.61 లక్షల ఎకరాల్లో వరి సాగు అయింది. వరితో పాటు జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడ, శనగ, చెరుకు, వేరు శనగ తదితర పంటలు సాగు అవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా రైతులు బోరుబావుల మీదనే ఆధారపడి సాగు చేసుకుంటున్నారు. లక్షా 5వేల బోరుబావులున్నట్టు అంచనా.

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

జిల్లాలో అత్యధికంగా రైతులు బోరు బావుల పై ఆధారపడి వరి పంటను సాగు చేశారు. ఒక లక్ష 5 వేల బోర్ బావులు ఉన్నాయి 1, లక్ష 50 వేల ఎకరాలపైగా రైతులు బోర్ల వద్ద వరి పంటను సాగు చేశారు. మరో లక్ష ఎకరాలు పోచారం సంగీతం నిజాంసాగర్‌తో పాటు చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో వరి పంటలు సాగు చేశారు. కాగా గత రెండు నెలలుగా భూ గర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. నెలనెలా అట్టడుగుల్లోకి వెళ్లిపోతున్నాయి. మార్చి నెల పూర్తయ్యే సరికి మరింత క్షీణించేఅవకాశం ఉంది. భూ గర్భ జలాలు అడుగంటుతుండటంతో బోరుబావులు ఎత్తిపోతుండటంతో పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా తాడ్వాయిలో 31.84 మీటర్లు, నాగిరెడ్డిపేట్-22.04, భిక్కనూర్-20.63, బిచ్కుంద-19.68 మీటర్ల లోతుల్లోకి భూ గర్భ జలాలు చేరుకున్నాయి. మార్చి అనంతరం ఏప్రిల్, మే నెలల్లో మరింత లోతుల్లోకి వెళ్లే అవకాశం ఉన్నట్టు భూ గర్భ జలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

బోర్లు పోస్తలేవు

ఈశ్వర్. నల్ల మడుగు పెద్ద తండా

యాసంగిలో ఆరు ఎకరాలలో వరి పంట వేసిన. ఉన్న రెండు బోర్లు సరిగా నీళ్ళు పోస్తే లేవు. ఎండలు ముదిరిపోతున్నాయి. పంటలు చేతికిరావడం కష్టంగా ఉంది.

ఎండిపోయే పరిస్థితి ఉంది

రాజా గౌడ్. పర్మల్ల

బోర్లు సరిగా పోయాక ఉన్న నాలుగు ఎకరాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచి బోరు నీళ్ల సరిగ్గా పోయడం లేదు. సగం పొలంకే నీళ్ల పారుతున్నాయి. మిగతా పొలం ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఆర్థిక ఇబ్బందులతో జీపీ కార్మికుడి ఆత్మహత్య

- పంచాయతీ కార్యాలయంలో ఉరేసుకొని బలవన్మరణం

నవతెలంగాణ-దోమకొండ



జీపీ కార్యాలయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ బాబు

ఆర్థిక ఇబ్బందులతో గ్రామపంచాయతీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంచాయతీ కార్యాలయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట గ్రామా నికి చెందిన కొంగరి బాబు (33) స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్ మెన్ కార్మికునిగా పనిచేసున్నారు. పనికి తగ్గ వేతనం అందకా, వచ్చే వేతనం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్థాపానికి గురై గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

14 మండల పరిషత్ సర్వసభ్యసమావేశం

నవతెలంగాణ-పిట్లం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14న ఎంపీపీ కవిత విజయ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచులు , సహకార సంఘ చైర్మన్లు , మండల , డివిజన్ స్థాయి , వివిధ శాఖల అధికారులు తమ శాఖ పరమైన ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

కబ్జా భూములను కాపాడి పేదలకు పంచండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్
- కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల పరిశీలన

నవతెలంగాణ-మాక్లూర్



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

మండలంలోని మానిక్‌బండారు శివారులోని భూమిని అక్రమ కబ్జా నుండి అధికారులు వెంటనే కాపాడి పేద ప్రజలకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో దాస్‌నగర్ గ్రామ ప్రజలతో కలిసి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, మండల కార్యదర్శి కొండగంగాధర్, గ్రామ శాఖ కార్యదర్శి ఎల్లయ్య సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిక్ బండార్ శివారులోని దాస్ నగర్ ప్రాంతంలో చెరువు కట్ట బఫర్ జోన్ కు సంబంధించిన ఇరిగేషన్ కెనాల్ సంబంధించి సుమారు రెండు ఎకరాల పైన ప్రభుత్వ భూములను డాక్టర్ సుజాత, డాక్టర్ సాంబశివరావు తన భూమిలో కలుపుకొని ఇనుప కంచెలను ఏర్పాటు చేసుకొని ఆక్రమించుకున్నారని తెలిపారు. అట్టి భూమిలో పంటలు పండించుకుంటున్నారని, నిజామాబాద్ కార్పొరేషన్ గా మారిన తర్వాత కార్పొరేషన్ పరిధిలోని భూములకు విపరీతమైన ధర పలకటంతో దాన్ని ఆసరా చేసుకుని డాక్టర్ సాంబశివరావు కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా తన స్వార్ధ ప్రయోజనాల కొరకు ఆక్రమించుకుంటున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు కానీ, రెవిన్యూ అధికారులు కానీ పట్టించుకోకపోవడం సరైంది కాదని అన్నారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని డాక్టర్ సుజాత పేరు మీద ఉన్న ఐదు ఎకరాల ఒక గుంట పోను మిగతా భూమిని ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడవలసిన అధికారుల నిర్లక్ష్యం మూలంగా కొద్దిమంది ధనవంతులు, రాజకీయ నాయకులు కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాజేస్తుంటే అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. పేదలు నివసించడానికి గుడిసెలు వేసుకుంటే మాత్రం క్షణాల్లో వాటిని తొలగించటం జరుగుతుందని ఇది పూర్తిగా బాధ్యతారహితమని అన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు, రెవిన్యూ అధికారులు స్పందించి డాక్టర్ సుజాత, సాంబశివరావు గారి పేర్ల మీద ఉన్న భూమిని సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని వెలికి తీసి ప్రజా ప్రయోజనాల కొరకు ఉపయోగించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాస్ నగర్ గ్రామ ప్రజలు ఎల్లయ్య నాగేష్, శ్రీనివాస్, అశోక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

పరిశుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సూచించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌కె డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు సోమారం గ్రామంలో క్యాంప్ నిర్వహించారు. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయకూడదని, పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులు గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామంలో ఉన్న వార్డులలో చెత్త చెదారాన్ని విద్యార్థులు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చరణ్ రెడ్డి, ఆర్కే గ్రూప్ ఆఫ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి ఎస్ ఆర్ కె కళాశాల ప్రిన్సిపల్ దత్తాత్రి ,మధుసూదన్ రెడ్డి ప్రోగ్రాం ఆఫీసర్ సాయిలు, మురళి, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామంలో చెత్తాచెదారం తొలగిస్తున్న విద్యార్థులు

మేకల సంత.. ఆదాయం ఎంత..?

- నేడే నవీపేట్ మేకల సంత వేలంపాట
- కోటికి పైగా టర్న్'ఓవర్'
- మేకలు, గొర్రెలతో పాటు వాహనాలపై ఆదాయం
- దళారి దందాతోనూ..
- సిండి"కేటుగాళ్ల" బుజ్జగింపులు ఫలించేనా?



మేకల కొనుగోలు, విక్రయదారులతో సంతలో సందడి

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్రంలోనే అతిపెద్ద మేకల సంత అయిన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మేకల సంత వేలంపాట సోమవారం నిర్వహించనుండడంతో మేకల సంత ఆదాయం ఎంత అని సర్వత్రా చర్చనీయాశంగా మారింది. సంత వేలం పాట రుసుం లక్ష రూపాయలు ఉదయం 11 గంటలలోపు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని పంచాయతీ పాలకవర్గం ప్రకటన చేయడంతో ఈసారి సుమారు 100 వరకు వేలంపాటదారులు పాల్గొనవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2021 -22 సంవత్సరం 44 లక్షలకుపైగా వేలం పాట పాడినా.. సిండికేటుగాళ్ల హైడ్రామాతో కేవలం 33 లక్షల 51 వేల రూపాయలకు గత ఏడాది దక్కించుకున్నారు. పాతకాపులు ఈ ఏడాది సైతం దక్కించుకునేందుకు బుజ్జగింపుల ప్రక్రియ ప్రారంభించగా ఈసారి ఎలాగైనా దక్కించుకోవాలని పలువురు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

వివరాలు మెయిన్‌లో..

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

- ఇంటర్ పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్లు
- ఎటువంటి ఒత్తిడికిలోను కావద్దు
- విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని ప్రయివేటు కాలేజీలపై చర్యలు తీసుకుంటాం
- నవతెలంగాణ ఇంటర్వ్యూలో డీఐఈవో రఘురాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఐఈవో రాఘురాజ్ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఫీజు పేరిట, ఇతరాత్ర కారణాలతో విద్యార్థులకు హాల్‌టికెట్‌ల ఇవ్వకపోతే సదరు ప్రయివేటు కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. గుర్తింపును సైతం రద్దు చేస్తాం. హాల్ టికెట్‌లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్ష రాసేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో డీఐఈవో రఘురాజ్ నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 35,017 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 17,503 మంది కాగా, రెండవ సంవత్సరం 17,514 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాము. అందులో గవర్నమెంట్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 18, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ లలో 04, మోడల్ స్కూల్ లలో 07, ప్రైవేటు కళాశాల 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నిమిషం నిబంధన అమలు

పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందే వెళ్లి పరిశీలించుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. గంట ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబోము.

ఆర్టీసీతో రవాణా సదుపాయాలు

అన్ని పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే చేరుకునే విధంగా జిల్లాలోని అన్ని గ్రామాల నుండి పరీక్ష కేంద్రాలు ఉండే ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేశాము. ఆ శాఖ అధికారులతో చర్చించి బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నాము.

సీసీ కెమెరాల పర్యవేక్షణ

ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రశ్నపత్రాలను తీసే సమయంలో పరీక్ష కేంద్రంలోని సీసీ కెమెరాలు ముందు ఓపెన్ చేయాలని నిబంధన పాటించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాము. అటువంటి సౌకర్యాలు ఉన్న కళాశాలలకే పరీక్షా కేంద్రాలుగా అనుమతించాము. ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించే పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ఆ ప్రాంతాలలో విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని అన్నారు.

మాస్ కాపీయింగ్ కట్టడికి బృందాలు

పరీక్షా కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ ఏర్పడకుండా ముందస్తుగానే 3 ఫ్లైయింగ్ స్కాడ్ టీం (1 తహసిల్దార్, 1 డిప్యూటీ తహశీల్దార్, 1ఏఎస్ఐ) లు, 1 హైపర్ కమిటీ (ఒక సినియర్ ప్రిన్సిపాల్), 4 సిట్టింగ్ స్కాడ్ టీం (ఒక టీం లో ఇద్దరు లెక్చరర్లు)లు, ఒక డిస్టిక్ ఎగ్జామినేషన్ కమిటీ (2 సినియర్ ప్రిన్సిపాల్, 1 లెక్చరర్) ఆధ్వర్యంలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా 9 టీం లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశాము. వీరు ఆకస్మికంగా తనిఖీలు చేపడతారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా ఉండేందుకు పరీక్ష కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు ఎక్కడ జిరాక్స్ సెంటర్ లు, బుక్ స్టాల్స్ మూసి ఉంచాల్సిందిగా పోలీస్ శాఖ నుంచి ఆదేశాలు జారీ చేయించాం.

హాల్‌టికెట్‌లు ఇవ్వకుంటే చర్యలు

ఫీజుల పేరిట విద్యార్థుల హాల్‌టికెట్‌లు ఇవ్వకుండా నిలిపిస్తే సదరు ప్రయివేటు జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకుంటాం. గర్తింపును సైతం రద్దు చేస్తాం. చివరి నిమిషంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు. విద్యార్థులు పరీక్షలకు ముందు ఎంతో కష్టపడి చదువుతారని అంటువంటి సమయంలో హాల్ టిక్కెట్లు ఇవ్వమనడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతారని అన్నారు.

విద్యార్థులు ఎటువంటి టెన్షన్లకు, ఒత్తిడికి లోను కావద్దని అటువంటిది ఏమైనా ఇబ్బందులు అనిపిస్తే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటివేషన్ చేయుటకు ప్రభుత్వం ప్రత్యేక టీం ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనుకోని ఒత్తిడి కి లోనైతే లటిషెట్టి మహేష్ 9440541373, తిరునగరి శ్రీహరి 9491622838, నక్క నవీన్ 9441055123, వడియల ప్రవీణ్ రెడ్డి 9849230134, డాక్టర్ విశాల్ 9985075295 లను సంప్రదించి ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు.

చేతి పంపు పట్ల నిర్లక్షం

చెట్లపొదల్లో ఉన్నా పట్టని అధికారులు



చెట్ల పొదల మధ్య చేతిపంపు

నవతెలంగాణ-జుక్కల్

ప్రజల, పశువుల దాహార్తి తీర్చిన చేతి పంపు అధికారుల నిర్లక్ష్యంతో మూలకు పడ్డట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. జుక్కల్ మండలంలోని బిజ్జల్ వాడీ ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు విస్తరణలో భాగంగా చేతి పంపు పూర్తిగా మట్టిలో కూరుకుపోయింది. చుట్టు పిచ్చిమొక్కలు పెరిగి ఆనవాళ్ళ లేకుండా మారింది. పదేండ్ల క్రితం పడంపల్లి, బిజ్జల్‌వాడి, కత్తల్‌వాడి, పెద్దఎడ్గి గ్రామాల రైతులు, ప్రయాణికులకు ఇది ముఖ్యమైన కూడలి. వారి దాహార్తి తీర్చేందుకు ఇక్కడ చేతి పంపును ఏర్పాటు చేశారు. ప్రయాణీకులతో పాటు ఆయాగ్రామాల రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే కూలీలకు, పశువులకు నీటిని వాడుకునేవారు. అంతటి ప్రాముఖ్యం ఉన్న చేతి పంపు మట్టిలో కూరుకుపోయినా పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేతిపంపు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పమాదవశాత్తు నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-సిరికొండ



వంటచేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మండలంలోని పెద్దవాల్గొట్ గ్రామానికి చెందిన వృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై నర్సింలు వివరాల ప్రకారం.. నారబోయిన నర్సుబాయి (78) సిలిండర్‌పై వంట చేస్తోంది. అన్నంగిన్నె దింపేక్రమంలో చీరకు నిప్పంటుకుంది. దీంతో 95శాతం కాలిపోయింది. వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. నారబోయిన పెద్ద నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అలరించిన ప్రజ్ఞ విద్యార్థుల ప్రదర్శనలు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్దగల ప్రజ్ఞ ఐటి అకాడమీ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి పట్టణంలోని ఎం.ఆర్ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రజ్ఞ వంశీకృష్ణ, ప్రిన్సిపాల్ రోమా, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే రైతు కమిషన్

- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి
- ఆర్మూర్ రైతు దీక్షనే పీసీసీ అధ్యక్షున్ని చేసింది
- రైతులను ఆదుకునేందుకు స్థిరీకరణ నిధి ఏర్పాటు
- రైతులకు ఆరోగ్య కార్డులు
- పసుపు, ఎర్రజొన్నకు గిట్టుబాటు ధర
- ఆదాని, అంబానీలకు దేశాన్ని దోచిపెడుతున్న మోడీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు కమిషన్ ఏర్పాటు చేస్తామని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. హత్ సే హత్ జోడో పాదయాత్రలో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్మూర్ ప్రాంత రైతులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశం ప్రారంభంలో 11మంది రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, గిట్టుబాటు ధరలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుల కోసం తీసుకోవాల్సిన చర్యలు, తదితరాలపై మాట్లాడారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.... ఈ ప్రాంతంలో 50సంవత్సరాల క్రితం బద్దం నర్సారెడ్డి రైతు సంఘాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్న రేవంత్‌రెడ్డి, రైతులకు ప్రత్యేక కండువా ఉండాలనే బద్దం నర్సారెడ్డి ఆలోచనతోనే రైతు కండువా పుట్టిందన్నారు. కండువానే రైతులకు ప్రత్యేక గుర్తింపు రావాడానికి ఆర్మూర్ ప్రాంత రైతులే ఆదర్శమన్నారు. రాహుల్ గాంధీతో వరంగల్ డిక్లరేషన్ పేరుతో మ్యానిఫెస్టో తయారు చేసినట్లు తెలిపారు. ఆర్మూర్ ప్రాంత రైతుల సమస్యలు తెలుసుకొని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని రైతులతో ఆత్మీయ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణామాఫీ తోపాటు ఇందిరమ్మ రైతు భరోసా కింద భూమి ఉన్న రైతులకే కాకుండా, కౌలు రైతులకు ఎకరానికి రూ.15వేలు అందిస్తామన్నారు. భూమి లేని ఉపాధి హామి పనికి వేళ్లే ప్రతికుంటుబానికి రూ.12వేలు ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో తెరిపిస్తామని, పసుపు బోర్డు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని, పంట నష్టం వస్తే రైతులను ఆదుకునేందుకు పంటల భీమా పథకం తెస్తామన్నారు.పెట్టుబడి నష్టపోతే తిరిగి చెల్లిస్తామని తెలిపారు. దీనికి స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతు చనిపోతే రైతు బీమా ఇస్తామనడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం నుండి సాయం అందాలంటే రైతు చావాలనే పరిస్థితిని కేసిఆర్ ప్రభుత్వం తీసుకు రావడం సరైంది కాదన్నారు.



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



హాజరైన రైతులు

రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతుల కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో క్రాఫ్ హాలీడే తీసుకు రావడానికి చంద్రశేఖర్ రావు ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. తాము అధికారంలోకి వస్తే మక్కలకు రూ.2200, ఎర్రజొన్నకు రూ.3500, వరికి రూ.2500, పసుపుకు రూ.12వేల మద్దతు ధర ఇస్తామన్నారు.

గుజరాత్ మోడల్ అంటే ప్రజల సొమ్ము బ్యాంకుల్లో పెట్టించి ఆ లక్షల కొట్ల డబ్బులను ఆదాని, ఆంబాలనీలకు ఎల్ఐసీ, ఎస్బీఐలలో లోన్‌లు ఇప్పించి అప్పజెప్పుడేనని ఏద్దేవా చేశారు. దేశంలోని వ్యవస్థల న్నింటిని అడ్డదారిలో ఆదాని, అంబాలనీలకు గుజరాతీ మోడల్లో అమ్మేస్తున్నారని విమర్శించారు. 3వేల వైన్ షాప్‌లు, 60వేల బెట్టు షాప్‌లే తెలంగాణ మోడల్‌అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ తీరుపై రేవంత్‌రెడ్డి ఓ కథను చెప్పడంతో రైతులంతా గొల్లున నవ్వారు. గతంలో పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేదని, ప్రస్తుతం ఎకరం పంట అమ్మిన తులం బంగారం వచ్చే పరిస్థితి లేదన్నారు. ఎంపి అరవింద్‌పై మండి పడ్డారు. ఆర్మూర్ గడ్డపై నిర్వహించిన రైతు దీక్షనే తనను పీసీసీ అధ్యక్షుడిని చేసిందన్నారు. ప్రతి పేదవాడికి రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీ బలోపేతం చేసి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ఆడబిడ్డల కోసం రూ.5వందలకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని తెలిపారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. రాష్ట్రంలో చత్తీస్‌ఘడ్ మోడల్ అమలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కిసాన్ ఖేత్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ముప్పా గంగారెడ్డి, నాయకులు తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, భూపతి రెడ్డి, సుంకెట రవి, వేణుగోపాల్ యాదవ్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రూపా సతీష్ రెడ్డియితీ ఉత్తమ సర్పంచ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రూపా సతీష్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దపల్లి సర్పంచ్ పానుగంటి రూపా సతీష్ రెడ్డి ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డు-2023 అందుకున్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి లో జరిగిన కార్యక్రమంలో అవార్డు సెలెక్షన్ కమిటి నేషనల్ చైర్మన్ బీఎస్, జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఈఅవార్డును అందజేశారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమి అధ్వర్యంలో ప్రతి ఏట ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా ఉత్తమ సర్పంచ్ నేషనల్ అవార్డును అందజేశారని సర్పంచ్ పానుగంటి రూపా సతిష్ రెడ్డి చెప్పారు. తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ, పదుచ్చేరి రాష్ట్రాల నుండి సుమారుగా 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరయ్యారని తెలిపారు. ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు. అవార్డు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నీలాలో సైలని బాబా ఉర్సు ఉత్సవాలు

- గంధాల ఊరేగింపు. వహీద్ బాబా



ఉర్సుకు హాజరైన వివిధ గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామ సమీపంలోని సైలలాని బాబా ఉరుస ఉత్సవాలను వహీద్ బాబా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నీల గ్రామం నుంచి ఒంటెలపై గంధాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సైలెన్ బాబా దర్గాకు పూలమాలతో అలంకరించారు. అనంతరం సలీం బాబా కవ్వాలి నిర్వహించారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వహిద్ బాబా పేర్కొన్నారు. సైలాన్ బాబా ఉర్సుఉత్సవాలకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి మహిళలు భక్తులు అత్యధిక సంఖ్యల్లో పాల్గొన్నారు. బొమ్మలు, తదితర దుకాణాలు వెలిశాయి. భారీ బందోబస్తుల మధ్య సైలని బాబా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, బీడీకార్మికులు

నవతెలంగాణ-మాక్లూర్

ఈ నెల13, 14తేదీల్లో జరిగే తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 9వ మహాసభల పోస్టర్లను మండలంలోని బార్గం (కే) గ్రామంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 13న రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి బీడీ కార్మికులతో ప్రదర్శన అనంతరం కోటగల్లిలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని బీడీ కార్మికుకు, ప్యాకర్స్ వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్ యూనియన్ జిల్లా నాయకురాలు దేశెట్టి రాధా, సుజాత , మంగమ్మా ఇంద్ర , రాణి , తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు విజయవంతం

నవతెలంగాణ-ఆర్మూర్

చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, ఎంజె హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మధు శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. మహిళలకు క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వహించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో సిరి హాస్పిటల్ వైద్యులు లింగారెడ్డి, జెనీవా వైద్యులు రవీందర్, స్త్రీ వైద్య నిపుణురాలు వసంతకుమారి, వైద్యులు పాల్గొన్నారు.

డాక్టర్ మధుశేఖర్‌కు సన్మానం..

వైద్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో ఉచిత శస్త్ర చికిత్సలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులూ షహాడ్ మీరా శ్రవణ్, ఎస్‌సిఎఫ్ఐ నాగరాజు, ఎంబీటీ అవైస్, పెర్కిట్ బీఆర్ఎస్ యూత్ నదీమ్, అఫ్రోడ్, ఉజైర్, అబ్రార్, అఫ్నం, ఖాలెద్, ఫహద్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యున్ని సన్మానిస్తున్న స్వచ్ఛందసంస్థ నిర్వాహకులు

టీయూలో అవినీతిని అడుకోకపోతే

మంత్రి ఇల్లు ముట్టడిస్తాం

- తెలంగాణ విద్యార్థి పరిషత్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ యూనివర్సిటీలో అవినీతిని అడ్డుకొకపోతే, జిల్లా మంత్రి ఇల్లును ముట్టడిస్తామని సజ్జనం భానుచందర్ ఆచార్య అన్నారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ప్రైవేట్ సంఘ భవనంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఇంచార్జీ సజ్జనం భానుచందర్ ఆచార్య మాట్లాడుతూ టీయూ వీసి రవీందర్ గుప్తా పరిపాలన మొత్తం అవినీతిమయం అయిందని, ఆయన వీసీగా వచ్చినప్పటినుండి వివాదాలకు, అవినీతికి కేంద్ర బిందువుగా కొనసాగుతుందని తెలిపారు. అవసరం లేకున్నా సిబ్బంది నియామకాలు చేపట్టి నిధులను దుర్వినియోగం చేస్తూ, నియామకం చేసిన సిబ్బంది నుండి డబ్బులు తీసుంటున్నట్లుగా అనేక మార్లు విమర్శలు వచ్చాయని అన్నారు. యూనివర్సిటీకి అవసరమైన ఫర్నీచర్, పరికరాలు కొనుగోలులో కూడా అధికారులు చేతివాటం చూపుతున్నట్లు అనేక విమర్శలు వస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం సీఏఎస్ (కెరియర్ అడ్వాన్స్ మెంట్ స్కీం) కింద అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పదోన్నతుల్లో పెద్దఎత్తున డబ్బు చేతులు మారుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. పదోన్నతులు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించి చర్చించి ఆమోదించాలన్నారు. ఈసి కమిటీ సభ్యులు కూడా గులాబీ కండువాలు కప్పుకొని జరుగుతున్న అవినీతిని ప్రశ్నించడంలేదని తెలిపారు. పదోన్నతుల పేరుతో ఒకొక్కరి నుండి 5 నుండి 10 లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తుందన్నారు. అవినీతిపై జిల్లా ప్రజా ప్రతినిధులకు విద్యార్థి సంఘాలుగా విన్నవించినా కనీసం నోరు మెదపడం లేదని తెలిపారు. ప్రజాప్రతి నిధుల ఇళ్లను, జిల్లా మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. యూనివర్సిటీలో అవినీతిపై సిబిసిఐడి ఎంక్వయిరీ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నగర అధ్యక్షుడు అఖిల్, కామారెడ్డి ఇంచార్జీ అనిరుధ్, రాజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భానుచందర్

సాటాపూర్‌లో తబ్లిక్ ఇస్తేమా



నవతెలంగాణ-రెంజల్

ప్రతి వ్యక్తి కురాన్ అనుసరిస్తూ, ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలని మత గురువు మౌలానా అనీష్ హజార్ హైమత్, మౌలానా అమీనుల్లా ఖాన్ స్పష్టం చేశారు. ముస్లిం మతంలో వర్గాలు తయారై ఖురాన్ నియమ నిబంధనలను పాటించడం లేదని ఆయన పేర్కొన్నారు. మానవత్వంతో హిందూ ముస్లిం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాటాపూర్ గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు ఈ సమావేశంలో పాల్గొన్న వారందరికీ అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

వెహికిల్ డ్రైవర్ కావలెను

నవతెలంగాణ-ఆర్మూర్

డివిజన్ పరిధిలో గల 14 ఆపరేషన్ సెక్షన్లలో ఫెయిల్ అయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రవాణా చేయడానికి గాను ఎంటీపికప్ కావలెనని విద్యుత్ శాఖ డివిజనల్ అధికారి సిహెచ్ హరిచంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ వాహన పత్రాలు ,డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు పట్టణంలోని జిరాయత్‌నగర్‌లోగల డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్ ఆఫీసు లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బకెట్ బిర్యానీ రెస్టారెంట్లు ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని హైదరాబాద్ వెళ్లే మార్గంలోని బైపాస్ రోడ్ చౌరస్తాలో ఆదివారం హాట్ బకెట్ రెస్టారెంట్‌ను మేయర్ నీతూ కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగర ప్రజలకు తక్కువ రెట్‌తో చికెన్,మటన్ బిర్యానీ రెస్టారెంట్ ను పెట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, పల్లికొండ అన్నయ్య, ప్రసాద్, షాప్ యజమాని ప్రకాష్ కుమారులు, కుటుంబ సభ్యులు,స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

బిగ్ బకెట్ బిర్యాని ప్రారంభం..

నిజామాబాద్ నగరంలోని మోర్ సూపర్ మార్కెట్ పక్కన బిగ్ బకెట్ బిర్యానీ రెస్టారెంట్ నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బిగ్ బకెట్ బిర్యానీ యజమానులు నరేందర్, దివ్య మాట్లాడుతూ.. నేటి యువత కనుగుణంగా బిగ్ బకెట్ బిర్యానీ అందుబాటు లోకి తీసుకువచ్చామన్నారు. సిట్టింగ్ లేదని కేవలం ఆర్డర్ చేసి తీసుకువెళ్లే అవకాశం మాత్రమే ఉందన్నారు. నిజామాబాద్ వాసులకు బిగ్ బకెట్ బిర్యాని సరసమైన ధరలకే అందిస్తున్నామన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని షాప్ యజమానులు కోరారు. అవసరమైన వారు 8885745550 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.



బిర్యాని రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మేయర్



బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

- పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని టీఆర్ఎస్ నాయకులు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. మండలంలోని కల్యాపూర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను డప్పులతో ఊరేగిస్తూ తీసుకొచ్చి చౌరస్తాలో దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సాయన్నకు బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షులు శేషు గారి భూమారెడ్డి, సర్పంచ్ పాముల సాయిలు, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు కాశం సాయిలు, రైతు సమన్వయ కమిటీ జిల్లా నాయకులు ఎండి మౌలానా, జిల్లా నాయకులు రఫిక్, నీలాసింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్, కందకుర్తి ఎంపీటీసీ అసాద్ బేగ్, సాటాపూర్ సర్పంచ్ ఏకార్ పాషా, హాజీ ఖాన్, లింగం, విజయ్, అనిల్, సంజీవ్, పార్థరాజు, మోసిన్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

రావూజి వంజరి సంఘం పాఠశాల సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ పట్టణంలోని నాందేడ్ వాడలో రావూజీ సంఘం పాఠశాలలో రావూజీ వంజరి సంఘం కార్యవర్గం, పాఠశాల సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. గంగాధర్, (బిజెపి) ప్రధాన కార్యదర్శిగా కాలేవారు సుభాష్, కోశాధికారిగా పాంద్రవీసం పెద్ద రాజేశ్వర్, రావుజి సంఘం పాఠశాల అధ్యక్షులుగా పోతన్ కర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బోదుకం నర్సయ్య (లడ్డు), కోశాధికారిగా రమేష్, వంజరి సంఘ సభ్యులు, పాఠశాల సంఘ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మూడు సంవత్సరాలు ఈ కార్యవర్గం కొనసాగుతుందన్నారు. రావూజి వంజర కుల సంఘాన్ని, పాఠశాలను అభివృద్ధి చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు.

సాగుతున్న ఎక్సైజ్ భవన నిర్మాణం

నవతెలంగాణ-మోర్తాడ్



ఎక్సైజ్ భావన నిర్మాణ పనులు ఏండ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభమైన బిల్డింగ్ నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితం పనులు పూర్తి చేసిన ఇంకా తలుపులు కిటికీలు నిర్మించకపోవడంతో నాలుగు సంవత్సరాలకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి 16 లక్షల రూపాయల వ్యయంతో ప్రారంభించిన నూతన ఎక్సైజ్ భవన నిర్మాణ పనులు నిధుల మంజూరు ఆలస్యంతో నత్తనడకన కొనసాగుతున్నాయి అద్దె భవనంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయాన్ని ఐకేపీ కార్యాలయానికి మార్చిన అధికారులు పూర్తిస్థాయి భవనానికి స్థలానికి కేటాయించి నిధులు మంజూరు చేశారు కానీ భవన నిర్మాణ పనులు పూర్తి చేయించడంలో విఫలమవుతున్నారు ఏడాదికి ఒక్కసారి పనులు చేస్తూ నాలుగు సంవత్సరాలుగా కొనసాగిస్తూనే ఉన్నారు. ఆరు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు నాలుగు సంవత్సరాలు అవుతున్న పనులు పూర్తి చేయించడంలేదు.

కార్పొరేట్‌ను తలపించేలా ప్రభుత్వ పాఠశాల





నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల అన్ని హంగులతో కార్పొరేట్ పాఠశాలను తలపిస్తోంది. మన ఊరు మన బడి కార్యక్రమంలో తాగునీరు, హ్యాండ్ వాష్ బేసిన్ లు, మూత్రశాలు, మరుగుదొడ్లు నిర్మించారు. తరగతి గదులలో రంగులు అద్దారు. తరగతి తదుల్లో టేబుళ్లలకు డెస్కులు అమర్చారు. నూతన బ్లాక్ బోర్డులు, టీచర్ టేబుల్స్ ను ఏర్పాటు చేశారు. ఒకటవ తరగతి నుండే ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు అందించారు. 3 వ తరగతి నుండి 8 వ తరగతి వరకు ఇంగ్లీష్ సులభంగా అర్థం అయ్యే అందుకు ఒక పేజీలో తెలుగు భాష మరో పేజీలో ఇంగ్లీష్‌లో పాఠ్యాంశాలు ఉన్నాయి. గణితం, సైన్స్, సోషల్ పుస్తకాలలో రెండు భాషలు ఉన్నాయి. రెండవ తరగతి నుండి విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్నారు. వినాయక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 243 మంది విద్యార్థులకు హాజరయ్యారు. ఏడుగురు ఉపాధ్యాయులకు 6 గురు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులకు ఆటలు ఆడుకోవడానికి క్యారం బోర్డు, రింగ్స్, చెస్ బోర్డ్ లు, స్కిప్పింగ్ త్రెడ్స్, ఇతరాత్ర ఆట వస్తువులు ఉన్నాయి. మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాలకు 10 లక్షలు మంజూరు చేశారు. 8.64 లక్షల రూపాయల వరకు ఖర్చు చేసి సౌకర్యాలు కల్పించారు. ఇంకా మిగితా పనులు చేపట్టనున్నారు.

సంచార వైద్యం అందక గేదె మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

సంచార వైద్యం అందక గేదె మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు మోసర్ల మహిపాల్ రెడ్డి గేదె అనారోగ్యానికి గురి అయింది. సంచార వైద్యం కోసం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఫోన్ చేసినా సంచార వాహనం రాలేదు. సంచార వైద్యం అందక గేదె ఆదివారం మూడు గంటలకు మృతి చెందినట్లు రైతు తెలిపారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గేదె మృతి చెందినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం గ్రామంలో ఆదివారం సి.సి.రోడ్డు పనులు ప్రారంబించారు. 5 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద ద్వారా సి.సి రోడ్లు నిర్మిస్తున్నారు. గిరిజన నాయుడు శిను నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చంద్రశేఖర్ రావు గ్రామాల అభివృద్ధికి ప్రత్యే చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌యస్ నాయకులు పీర్‌సింగ్ బల్ రాం, శంకర్ నాయక్, రమేశ్, మంగ్య నాయక్, సురేందర్ ప్రేమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



గాయపడ్డ బాలయ్య

నవతెలంగాణ-రామారెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గిద్ద గ్రామానికి చెందిన కొండపురం బాలయ్య (50) అతని కుమారుడు రంజిత్ మోటార్ సైకిల్‌పై సదాశివనగర్ నుండి గిద్దకు గత ఆదివారం వస్తుండగా మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు కిందపడి ఇద్దరికీ గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. బాలయ్యకు తీవ్ర గాయాలు అవ్వడంతో, మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడని, మృతుడి బావ చాకలి నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఎన్నికైన ఆలయ కమిటీ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల కొమ్మ హనుమాన్ మందిర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా తెప్పవార్ విట్టల్ ఎన్నికయ్యారు. ఆదివారం రోజు ఆలయ ఆవరణంలో కొమ్మవార్ హనుమాన్ మందిర చుట్టుపక్కల జనాలు మందిరావరణంలో ప్రత్యేకంగా సమావేశమై కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తెప్ప వార్ విట్టల్, ఉపాధ్యక్షులుగా ఏకంబేకర్ మనోజ్, కోశాధికారిగా గడ్డివార్ నాగనాథ్, సభ్యులుగా దశరథ్ కర్రెవార్, ఎరుకల బలరాం, జ్ఞానేశ్వర్ గొంతే, తుకారం తేప్ప వార్, ఎన్నార్ రాజు, ఉత్కర్ వార్ గణేష్, గడ్డివార్ తుకారం, దత్తు, సాయిలును ఎన్నుకున్నారు.

భూమికి పచ్చని రంగు వేసినట్లు



వరిపైరుతో పరుచుకున్న పచ్చదనం

నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి మండలాలలో రైతులకు సంబంధించిన వరి పంటచేలు పచ్చని పైరు రోడ్డుగుండా వెళ్లే వారికి ఆహ్లాదాన్నిస్తుంది. నిజామాబాద్ నుంచి వర్ని వెళ్లే రహదారికి ఇరువైపులా వరి పైరులతో భూమికి పచ్చాని రంగు వేసినట్టు కనిపిస్తుంది.

14న ఎస్సీ కార్పోరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-జుక్కల్

మార్చి 14 వ తేదిన ఎస్సీకార్పోరేషన్ ఆధ్వర్యంలో పీఎమ్ విజయ్ ఇంటర్వ్యూలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపిడివో నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎమ్ విజయ్ ఇంటర్వ్యూలకు కామారెడ్డి జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడీ దయానంద్ రానున్నారని, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. లబ్దిదారులు సకాలంలో వచ్చి ఇంటర్వ్యూలో పాల్గొవాలని సూచించారు.

బలమైన విప్లవ కార్మిక సంఘం నిర్మించాలి



మాట్లాడుతున్న ఎం. శ్రీనివాస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బలమైన విప్లవ కార్మిక సంఘం నిర్మించాలని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం. శ్రీనివాస్ అన్నారు. ఐఎఫ్‌టీయూ మహాసభను పుట్ట వరదయ్య అధ్యక్షతన నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం. శ్రీనివాస్, సిపిఐ యంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బి.బాస్కర్, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గడ్డం గంగులు మాట్లాడుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) దేశ వ్యాప్తంగా కార్మిక సమస్యలపై క్రియాశీల ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఎర్రజెండా ముసుగులో కార్మికులకు ద్రోహం చేసిన కార్మిక సంఘాలు ఉన్నాయని అన్నారు. వీటికి బిన్నంగా రాజకీయ, నిర్మాణ పోరాట కర్తవ్యాలను రూపొందించుకొని పని చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. కార్మిక సమస్యలతో పాటు రాజకీయ పరిణామాలపై కార్మికులను చైతన్యం చేసి పోరాడాలని సూచించారు. వర్గ చైతన్యం ద్వారానే సమాజంలోని అన్యవర్గ దోరణులపై పోరాటం చేయగలమని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం బడా బూర్జువా వర్గానికి తోత్తులుగా మరి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. అంబానీ, అదానిలకు ఈ దేశాన్ని దోచి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడిసాదించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి దోపిడీ వర్గాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు.

హద్దుల్ 'బద్దల్'



- భూముల సర్వే కోసం దరఖాస్తులు పెండింగ్
- సర్వేయర్ లేక హద్దుల వద్ద తరుచూ గొడవలు
- ప్రభుత్వ స్థలాలు కబ్జా అవుతున్నా
- పట్టించుకునే నాథుడు కరువు
- దోమకొండకు సర్వేయర్‌ను నియమించాలని డిమాండ్

నవతెలంగాణ-దోమకొండ

భూముల పొలాల హద్దులు సరిచూసే సర్వేయర్ లేక రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సర్వే చేసేందుకు దరఖాస్తు చేసుకున్నా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పక్క వారితో నిత్యం గొడవలు చోటుచేసుకుంటు న్నాయని వాపోతున్నారు. దీనికి తోడు మండలం వ్యాప్తంగా ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడు కరువైయ్యాడు. సర్వేయర్ ఉంటే ఎప్పటికప్పుడు సర్వే చేపడుతూ హద్దులు చూపించే అవకాశం ఉందని, దోమకొండ మండలానికి సర్వేయర్‌ను నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

దోమకొండ మండల సర్వే యర్ పోస్ట్ ఖాళీగా ఉండడంతో రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని నెలల క్రితం కామారెడ్డి ఏడి కార్యాలయం నుండి డిప్యూటేషన్‌పై దోమకొండ మండల సర్వేయర్‌గా రాకేష్ కొంత కాలం విధులు నిర్వహించారు. గతేడాది జూన్ నెల నుండి మండల సర్వే యర్ వ్యక్తి గత కారణాల వల్ల సెలవులో ఉంటున్నారు.

దోమకొండ మండలంలో గత తొమ్మిది నెలల నుండి భూ సర్వే కోసం 106 మంది రైతులు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. అయినా వాటిని పరిశీలించి సర్వే చేసే వారు కరువైయ్యారు. మండల సర్వే యర్ లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలు, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్, ముత్యం పేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఖాళీ స్థలం, దేవాదాయ శాఖ భూములు, చెరువు లు, కుంటలను కబ్జా చేస్తున్నారని, కబ్జా దారులపై ఎలాంటి చర్యలు రెవెన్యూ అధికారులు తీసుకోవడం లేదని మండల రైతులు, ప్రజలు ఆరోపిసున్నారు. మండలంలో ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన కబ్జా దారులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోవడం లేదని, జిల్లా కలెక్టర్, పై స్థాయి అధికారులు స్పందించి కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలని, మండల సర్వేయర్‌ను కేటాయించాలని మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

హద్దుల సమస్య ఉంది..
కిష్టయ్య రైతు. అంచనూరు



నాకు ఐదు ఎకరాల వ్యవసాయం భూమి ఉన్నది. భూ హద్దుల సమస్య కోసం భూ సర్వే దరఖాస్తును మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాను. మండల సర్వేయర్ లేదని రెవిన్యూ అధికారులు చెప్పుతున్నారు. మండల సర్వేయర్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలి.

కబ్జా అవుతున్నా పట్టట్లేరు
నాగారపు ఎల్లయ్య
సీఐటీయూ నాయకులు

దోమకొండలో ప్రభుత్వ స్థలాలు, ఆర్ అండ్ బీ గేస్ట్ హౌస్ ఖాళీ స్థలం కబ్జాకు గురైంది. ప్రభుత్వ స్థలాలు సర్వే చేయాలనీ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మండల సర్వే యర్ అధికారి లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు. సర్వేయర్ లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, కలెక్టర్ అధికారులు స్పందించి మండల సర్వే యర్‌ను వెంటనే నియమించాలి. నియమించలి.

ఉన్నతాధికారులకు నివేదించాం
తహసీల్దార్ కౌశిక



దోమకొండ మండల సర్వేయర్ పోస్ట్ ఖాళీగా ఉన్న మాట వాస్తవమే. దోమకొండకు డిప్యూటేషన్‌పై మండల సర్వేయర్‌గా పనిచేసిన రాకేష్ గత తొమ్మిది నెలల నుండి వ్యక్తి గత కారణాల సెలవులో ఉన్నారు. భూ సర్వే కోసం డివిజన్ సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించాము. మండల సర్వే యర్ అధికారిని నియమించాలని ఆర్డీవో, పై స్థాయి అధికారులకు నివేదించాము.

భూములు గుర్తించి పేదలకిస్తాం

- నిరుపేదలకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతి రామ్ నాయక్ డిమాండ్
- 24న బైక్ ర్యాలీ.. కామారెడ్డిలో బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు

నవతెలంగాణ-లింగంపేట్



మాట్లాడుతున్న మోతీరాం నాయక్

భూమిలేని నిరుపేద కుటుంబాలకు మూడెకరాల భూమి ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతి రామ్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం లింగంపేట మండలం రాంపల్లి తండాలో.. సెంటు భూమిలేని నిరుపేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతి రామ్ నాయక్ మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ భూములు కొన్ని వందల ఎకరాలు.. దొరల అధీనంలో, భూస్వాములు అధీనంలో ఉన్నాయని తెలిపారు. సర్వే చేసి అవి గనక తీస్తే.. దళితులకు గిరిజనులకు మూడే ఎకరాలు ఇవ్వవచ్చని తెలిపారు. కానీ ప్రభుత్వం ఆ పని చేయటం లేదని అన్నారు. అందుకే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో అధ్యయనం చేసి వివరాలు వెలికి తీస్తున్నామని, భూమి లేన పేద ప్రజలకు పంచే కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ నెల 24న పద్మజీవాడి ఎక్స్ రోడ్ నుంచి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కామారెడ్డి వరకు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆ ర్యాలీలో రాష్ట్ర నాయకులు తో పాటు.. జిల్లా నాయకత్వం పాల్గొంటుందని తెలిపారు. భూమిలేని నిరుపేదలు కూలీలు కామారెడ్డిలో జరిగే బహిరంగ సభలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఆ సభలో భూ సమస్యలన్నీ మాట్లాడతారని.. భూ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేసే ప్రకటన చేస్తారని అన్నారు. కామారెడ్డి చుట్టుముట్టు ప్రాంతంలో.. ప్రభుత్వ భూములో వెంచర్లు వేసి దొంగ రిజిస్ట్రేషన్లు కూడా చేసుకుంటున్నారని ఆ భూమిలో కూడా ఎర్రజెండాలు పాతుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ రవి ప్రకాష్ శాంతక్క తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో ఇంటింటికి టీడీపీ

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో ఆదివారం తెలుగుదేశం నాయకులు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు మోడేగామ మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తెలుగుదేశానికి పూర్వపు వైభవం వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్దే ఉందన్నారు. ప్రజలు తిరిగి అభివృద్ధిని కోరుకుంటున్నారని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని ఇంటింటికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీ కవితకు క్షమాపణలు చెప్పాలి

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం
- పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు

నవతెలంగాణ-నసురుల్లాబాద్/పిట్లం/లింగంపేట్



నసురుల్లాబాద్‌లో బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ నసురుల్లాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదివారం దహనం చేశారు. బాన్సువాడ, నిజామాబాద్ వెళ్లే రహదారిపై బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు సంజయ్ కుమార్ కు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. బండి సంజయ్ కుమార్ వెంటనే కవితకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పాల్త్య విఠల్, జిల్లా కో అప్షన్ మెంబర్ మజీద్, వివిధ గ్రామాల సర్పంచ్ లు ఎంపిటిసి సభ్యులు, మండల నాయకులు కంది మల్లేష్, మైషగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ప్రతాప్ సింగ్ తదితరులు హాజరయ్యారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి


పిట్లం : ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని మండల భారత జాగృతి అధ్యక్షులు నిలకంటి మనోహర్ రాంలోక , మహిళ అధ్యక్షురాలు మంజుల డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ ఇటీవల అనుచిత వ్యాఖ్యలతో మహిళ సభ్య సమాజం తలదించుకునేలా దుర్భాషలాడటం మహిళ లోకానికి అవమానకరం అని అన్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, శశి, షఫీ, నందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

లింగంపేట్ : ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు బండి సంజయ్ పై కేసు నమోదు చేయాలని ఆదివారం మండల బి ఆర్ ఎస్ పార్టీ లింగంపేట్ పోలీస్ స్టేషన్ లో పార్టీ మండల అధ్యక్షులు దివిటి రమేష్ ఆధ్వర్యంలో లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గరీబునిస నహీం మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మహిళ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ సిద్దిరాం రెడ్డి, సర్పంచ్ బొల్లు లావణ్య శ్రీకాంత్, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, ముస్తాపూర్ సర్పంచ్ మమత వివేకానంద పాల్గొన్నారు.



లింగంపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పిట్లంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మన ఊరు -మన బడి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండలో అదనపు గదుల కొరత, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వ విప్ గోవర్ధన్ నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేశారని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు.. దోమకొండ కేంద్రంలోని మన ఊరు మన బడి పదకం లో భాగంగా బాలుర ఉన్నత పాఠశాలను ప్రహరీ నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. మన ఊరు మన బడి పదకం పనులు నాణ్యతతో నిర్మాణ పనులు కొనసాగించాలని సూచించారు. పరిశీలించిన వారిలో జడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్ సర్పంచి నల్లపు అంజలి శ్రీనివాస్, ఎంపీటీసీ నిమ్మ శంకర్, కో ఆప్షన్ మెంబర్ షమ్మీ, మైనార్టీ నాయకులు ఎస్ కే హసన్ పాల్గొన్నారు.

సాగుతున్న శనగ కొనుగోలు



శనగలు తూకం వేస్తున్న హమాలీలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శనగలు కొనుగోలు కొనసాగుతున్నాయి. శనగలు అమ్మ డానికి రైతులు పెద్దఎత్తున తరలివస్తున్నట్టు సీఈవో దేవేందర్ తెలిపారు. ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల శనగలు కొనుగోలు చేసి మార్క్ పెడ్ పంపినట్టు తెలిపారు. శనగలను జాలీపోసి మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారమే కొనుగోలు చేస్తునట్లు తెలిపారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని పంతులునాయక్ తండలో సేవలాల్ ఆలయ నిర్మాణానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఐటీ సెల్ చైర్మన్ మదన్ మోహన్ రావు ఈ సందర్భంగా గుడి నిర్మాణానికి తన వంతు సహకారంగా 100 బస్తాల సిమెంటును విరాళంగా ప్రకటించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేష్ స్థానిక నాయకులతో కలిసి అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూర్పు రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘని బాబా, సాయిలు అబ్బు, మధు ,బూర్గుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, నెల్లి సాయిలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
4
సోమవారం 13 మార్చి 2023

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



నవతెలంగాణ-ఆర్మూర్

బీసీ. స్టడీ సర్కిల్స్ హైదరాబాద్ వారు పట్టణ గ్రంథాలయానికి గ్రూప్ 1,2,3,4, తెలుగు ఇంగ్లీషు మీడియం పుస్తకాలు ఉచితంగా అందజేయడం జరిగిందని లైబ్రేరియన్ వరలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి :సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే నియోజకవర్గానికి సంబంధించిన సర్పంచ్ నవ్య పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్సీ కవితపై ఎంపీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి.సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఈ విధంగా రాజకీయంలో సంభాషించుకోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ స్పందించి మహిళలపై, మహిళా నాయకులపై అనవసర పదాలు వాడి హేళన చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలుచోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు



నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని వీధి వీధిలో, ప్రధాన చౌరస్తా, కిరాణ షాపులు, కల్లుబట్టీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎస్ఐ అనిల్ రెడ్డి ఆదేశాల మేరకు దుకాణ సముదాయాలవారు, పంచాయతీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో వర్ని మండల కేంద్రంలో దొంగతనాలు, మహిళల కిడ్నాప్, హత్యలు జరిగిన ఘటనలవల్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారని ప్రజలు అంటున్నారు. నిందితులను తొందరగా పట్టుకోవాలంటే సీసీ కెమెరాలు ఎంతో ముఖ్యమని ఎస్సై తెలిపారు. సిసి కెమెరాలు 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తాయని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆరంభంలోనే భానుడి ప్రతాపం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ప్రతి ఒక్కరూ వేసవి జాగ్రత్తలు పాటించాలి
- సూచిస్తున్న వైద్యులు

ఎండాకాలం ప్రారంభం నుండే ఎండ(భానుడి) ప్రతాపం పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. పిల్లలకు, వృద్ధులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు వైద్యులు. లేదంటే తలనొప్పి, ఒళ్లు మంట, డీ హైడ్రేషన్ లాంటి సమస్యలు వెంటాడుతాయని హెచ్చరిస్తున్నారు.

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎండతీవ్రతకు నిర్మానుష్యంగా మారిన కంఠేశ్వర్ చౌరస్తా ప్రధాన రోడ్డు

వేడిని తట్టుకునేందుకు కొన్ని జాగ్రత్తలు..

ఎండలోకి తప్పనిసరిగా వెళ్లేవారు సన్‌స్క్రీన్ లోషన్స్ వాడాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగడం మంచిది.రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తీసుకోవాలి.ఎండలో ప్రయాణించే వారు గొడుగు, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాలి. ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేవిధంగా చూసుకోవాలి.

వేసవిలో చర్మ సంరక్షణ..

వేసవికాలంలో చర్మాన్ని చాలా పదిలంగా చూసుకోవాల్సి ఉంటుంది. రోజంతా చర్మం పై తేమ ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం మాయిశ్చరైజింగ్ క్రీమును రాసుకోవాలి. చర్మం బాగా పొడిబారిపోయినప్పుడు సబ్బుకు బదులుగా చల్లటి నీటితో కడుక్కుంటే తాజాగా ఉంటుంది. అతినీలలోహిత కిరణాల వల్ల చర్మంలోని కొల్లాజెన్‌ను దెబ్బతీస్తాయి. దీంతో చర్మంపై ముడతలు ఏర్పడతాయి. ఎండలో వెళ్లేవారు సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసుకోవాలి. కాటన్ వస్త్రాలు ధరించాలి. టోపి లేదా గొడుగు వాడడం వల్ల సూర్యకిరణాల నుంచి రక్షణ లభిస్తుంది. పుచ్చకాయ, ద్రాక్ష, కర్భూజ లాంటి పండ్లరసాలను ఎక్కువగా తీసువాలి. మజ్జిగ, కొబ్బరి నీరు తాగడం మరింత మంచిది. కీరదోస, క్యారట్, బీట్‌రూట్ లాంటివి కూడా తినవచ్చు. ఎండకు శిరోజాలు దెబ్బతినకుండా ఉండడానికి కండీషనర్ క్రీమును రాసుకోవడం తప్పనిసరి. స్విమ్మింగ్ చేసేవారు తలకు మాస్క్ ధరించాలి. లేదంటే క్లోరిన్ కేశ సౌందర్యాన్ని దెబ్బతీస్తుంది.

వడదెబ్బ నివారణ మార్గాలు..

వేసవికాలంలో బయటకి వెళ్ళేటపుడు వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లాలి. ఆల్కహాల్, సిగరెట్, కెఫీన్ వంటి వాటికి దూరంగా ఉండండి. వాంతులు, అలసట, తలనొప్పి వంటివి రాకుండా చూసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగిపోవటం వల్ల వడ దెబ్బ తగిలే అవకాశం ఉంది. ఇలాంటి సమయాల్లో వైద్యులను సంప్రదించాలి.

పిల్లలు జర భద్రం..

అధిక ఉష్ణోగ్రత, కలుషిత నీరు, ఆహారం వల్ల వేడిని అధిగమించడానికి తీసుకునే శీతల పానీయాల వల్ల పిల్లలు జబ్బుపడుతూ ఉంటారు. ఎండలో ఎక్కువసేపు తిరిగినా, ఆడినా చెమట ద్వారా లవణాలు కోల్పోయి నీరసించిపోతారు. తలనొప్పి కూడా రావచ్చు. శరీర ఉష్ణోగ్రత పెరిగితే ఫిట్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ. చెమట వల్ల శరీరం చల్లబడే ప్రక్రియ దెబ్బతిని వడదెబ్బ తగలవచ్చు. చర్మంపై పేరుకుపోయిన వ్యర్థాల వల్ల చెమట పొక్కులు రావచ్చు. ఒక్కోసారి ముక్కు నుంచి రక్తం కారవచ్చు.

నీరు, ఆహారం కలుషితమైతే...

నిలవ ఆహారం తింటే వాంతులు, విరేచనాలు కావచ్చు. ఎక్కడపడితే అక్కడ నీరు తాగితే కూడా జబ్బుపడవచ్చు. డీహైడ్రేషన్ సంభవిస్తే, ఒక్కోసారి మూత్రం బంద్దైపోయి, రీనల్ ఫెయిల్యూర్ వల్ల ప్రాణహాని కూడా జరగవచ్చు. కలరా, టైఫాయిడ్, కామెర్ల వంటి వ్యాధులు కలుషిత ఆహారం వల్ల వ్యాపించ వచ్చు. శీతలపానియాలవల్ల ఇన్‌ఫెక్షన్లు సంభవించ వచ్చు.

ఇన్‌ఫెక్షన్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కట్టనర్సింహ, ప్రముఖ న్యూరోసర్జన్



చలి తగ్గి ఎండలు ముదరక ముందే గవద బిళ్ళలు, టైఫాయిడ్, పొంగు, హైపటైటిస్ 'ఏ' కామెర్లు కూడా ఎండాకాలం బాగా వ్యాపిస్తాయి. ఇవన్నీ టీకాలతో నిరోధించే ఇన్‌ఫెక్షన్లే. ఆటలమ్మ (చికెన్ పాక్స్) టీకా ఒకటిన్నర సంవత్సరాలు నిండిన పిల్లలకి తప్పకుండా ఇవ్వాలి. 4-6 సంవత్సరాలకి రెండవ మోతాదు ఇవ్వాలి. లేకుంటే పెద్దయ్యాక వారికి సర్పి అనే అతి బాధాకరమైన వ్యాధి (హెర్పిస్ జోస్టర) సంభవించవచ్చు. మూత్రం ఇన్ ఫెక్షన్ సర్వసాధారణం. ఎండాకాలం కళ్ళ కలక వేగంగా వ్యాపిస్తుంది. దుమ్మూధూళి వల్ల, వేడి వల్ల కంటి ఇన్‌ఫెక్షన్ త్వరగా వస్తుంది. ఒకోసారి చూపు మందగించి, రెటినాపై కూడా ప్రభావం చూపవచ్చు.

పిల్లలకు రకరకాల ద్రవాలు తాగించాలి. రెండు గంటలకోసారి మూత్రం సాఫీగా పోసేలా చూడాలి. రెండు పూటల స్నానం చేయించాలి. పళ్ళు, కూరగాయలు ఎక్కువగా తినిపించాలి. మసాలాలు తగ్గించాలి. బయటి ఆహారం తినిపించకూడదు. తాజా ఆహారం మాత్రమే పెట్టాలి.

రైతుల కష్టాలపై రేవంత్‌కు డాక్యుమెంటరీ అందజేత



రేవంత్‌రెడ్డికి రైతు కష్టాలను వివరిస్తున్న రైతు రవిరెడ్డి

నవతెలంగాణ - ముప్కాల్

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చందా రవి రెడ్డి (వేంపల్లి సొసైటీ డైరెక్టర్) రైతుల కష్టాలను పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి వివరించారు. ఆదివారం కమ్మర్‌పల్లిలో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో రైతుల సమస్యలను దాదాపు 15 పేజీలతో కూడిన డాక్యుమెంటరీని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి అందజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కన్నీటి కష్టాలను దూరం చేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. రైతు రవి రెడ్డి వెంట మండలానికి చెందిన రైతులు, కాంగ్రెస్ నేతలు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు



పోటీలకు హాజరైన క్రీడాకారులు

నవతెలంగాణ-ముప్కాల్

వేముల సురేందర్ రెడ్డి స్మారక మెమోరియల్ జూనియర్ స్థాయి వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం వాలీబాల్ క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.గంగాధర్ పరిచయం చేసుకున్నారు. ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.గంగాధర్, మోతే గంగారెడ్డి, ఉప సర్పంచ్ బ్రమ్మదండి లింగం, మాజీ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ముస్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను అరెస్టు చేయాలి

నవతెలంగాణ-వర్ని



ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ని వెంటనే అరెస్టు చేయాలని ఆదివారం వర్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, కార్యదర్శి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై నోటికొచ్చినట్టు మాట్లాడడం బీజేపీ పార్టీకి సిగ్గుచేటని హెచ్చరించారు. మహిళను గౌరవించలేని బండి సంజయ్‌ను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపించాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు టిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి ఏఎంసివైస్ చైర్మన్ గోపాల్, నామాల సాయిబాబా, ఉపసర్పంచ్ కంది కృష్ణ, గ్రామ అధ్యక్షులు నాగేశ్వరరావు, వైసీపీ దండ్ల బాలరాజు, కోఆప్షన్ నెంబర్ కరీం, సత్తార్, రంజాన్, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని సుంకెట్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. 15 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడంతో ఆ నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పిటిసి రవి, పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో మహిపాల్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జమున గంగాధర్, ఎంపీటీసీ రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, వార్డు సభ్యులు మేతరి నర్సయ్య పడాల జితేందర్ గౌడ్, ఠాగూర్ స్వప్న, గొల్ల భాస్కర్, అప్పల గణేష్, మాజీ ఎంపిటిసి ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు ధోన్‌పాల్ రాజేశ్వర్, నోముల నవీన్, అంతిరెడ్డి భూపతి, గంగాధర్ గౌడ్, అంతిరెడ్డి రమేష్, బొల్లి సంతోష్, మనోజ్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు నిర్మించడం అభినందనీయం

- గురుకుల సొసైటీ ఉప కార్యదర్శి ప్రసాద్ రావు



మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో గురుకుల పాఠశాలలకు, బాలికల తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సేవా కార్యకర్తలు, దాతలు ముందుకు వచ్చి అదనపు తరగతి గదులను నిర్మించడం అభినందనీయమనిగురుకుల సొసైటీ ఉప కార్యదర్శి ప్రసాద్ రావు అన్నారు. ఆదివారం ఎడపల్లిలోని తెలంగాణ గురుకుల బాలికల గురుకుల పాఠశాలకు దాత మల్లాది వెంకటేశ్వర శర్మ రూపాయలు అరకోటి వెచ్చించి అదనపు తరగతి గదులను నిర్మించి ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి దాతల సహకారంతో గురుకుల పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఎడపల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షులు కదం ప్రకాష్ రావు ఐదేళ్లపాటు తన వంతుగా పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు, సదుపాయాలకు కృషి చేస్తున్నందుకు ఆయనను అభినందించారు. కదం ప్రకాష్ రావు తన స్నేహితులపై ప్రవాస భారతీయుల ద్వారా పాఠశాలలో కావలసిన మౌలిక సదుపాయాలను సమకూర్చడంలో ప్రత్యేక శ్రద్ధ చూపడం గర్వించదగ్గ విషయమని అన్నారు. దాత మల్లాది వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ... పాఠశాలలంటే మేధస్సును ఉత్పత్తి చేసే యంత్రాలుగా భావిస్తారని, అదే స్ఫూర్తితో తాను అదనపు తరగతి గదులను నిర్మించి ఇచ్చామని తెలిపారు. మంచి విద్యా బోధనతో భారత పౌరులుగా రూపుదిద్దునప్పుడే తమకు సార్ధకత చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎడపల్లి ఎంఈఓ కొడాలి రామారావు, విశ్రాంత ప్రధాన ప్రిన్సిపల్ అంబీరు రాజేంద్ర ప్రసాద్ రావు, గురుకుల ప్రిన్సిపాల్ లు సుహాసిని రెడ్డి, దేవి సింగ్, కిషన్, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ ఆకుల మాధవి, ఎంపీటీసీ మనిషా రెడ్డి, బోధన్ ఏఎంసి డైరెక్టర్ ప్రభావతి, ఉపాధ్యాయులు నాగరాణి మాధురి రజిని బాబు కిరణ్ శంకర్ గౌడ్ మాధవి అధ్యాపక బృందం బాలికలు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఎన్సిసి క్యాడెట్ల ప్రదర్శన, విద్యార్థినిల బ్యాండ్ మేళం పలువురిని ఆకట్టుకుంది. అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాలు



బోనాలతో వస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు, కులస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్ రెడ్డి ,పండిత్ పవన్ ,పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, ఎస్సార్ రమేష్, ముదిరాజ్ సంఘ నాయకులు మందుల పోశెట్టి, జక్కం నరేందర్, సంబాడి ఆనంద్, ప్రసాద్, బొండ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, కష్టపడేతత్వం ఉంటేనే విజయం

- ఆర్డీఓ రాజేశ్వర్
- ఘనంగాఇందూర్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో మెలుగుతూ కష్టపడేతత్వం కలిగి ఉంటే జీవితంలో తప్పకుండా విజయం సాధిస్తారని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. శనివారం రాత్రి బోధన్ పట్టణం లోని ఆచన్ పల్లిలోగల ఇందూర్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలకు హాజరై ప్రసంగించారు. నవోదయ లాంటి పాఠశాలల్లో విద్యార్థులకు సామాజిక సేవపై, అలాగే పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తారని, అలాంటి శిక్షణ ఈ ఇందూర్ హైస్కూల్ లో ఉందని అభినందించారు. విద్యా బోధన అనేది రొటీన్ గా కాకుండా ఆసక్తికరంగా, వారికి ఉత్సాహం కలిగేలా సూచించారు. ఎన్‌సీసీతో పాటు ఇతర పోటీ పరీక్షల్లో పాల్గొంటూ అన్ని అంశాల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. కౌమార దశలో వచ్చే మార్పులకు అనుగుణంగా జరిగే విధానంపై ఈ పాఠశాలలు చేస్తున్న విద్యా బోధన అభినందనీయమని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. 8, 9 తరగతుల విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు ఇష్టమైన రంగాలలో ఎదగడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. స్మార్ట్ ఫోన్లతో విద్యార్థులు పెడదారి పట్టే అవకాశం ఉందని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు గురువులను, పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించేలా నైతిక విలువలు నేర్పాలని బోధన్ ఏసిపి కిరణ్ కుమార్ సూచించారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని, ఉన్నత ఆలోచనలు కలిగి ఉండాలని ఏసీపీ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి . ఈ కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, ఇందూర్ హైస్కూల్ అధినేత కొడాలి కిశోర్, మండల విద్యాధికారి నాగనాథ్, లయన్స్ క్లబ్ ముఖ్య ప్రతినిధి బసవేశ్వర రావు, ఇందూర్ బి.ఎడ్ కళాశాల డైరెక్టర్ థామసయ్య, ఉషోదయ కళాశాల డైరెక్టర్ సూర్య ప్రకాష్, విద్యా వికాస్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌ఎం రామారావు లయన్స్ క్లబ్ రీజనల్ మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో



డ్యాన్సు చేస్తున్న విద్యార్థులు

చదువుతోపాటు ఆటల్లో ముందుండాలి

- బీఆర్ఎస్ నియోజకవర్గఇంచార్జ్ ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

చదువుతోపాటు ఆటల్లో సైతం విద్యార్థులు ముందుండాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం పట్టణంలోని ఆల్ ఫోర్స్ నరేంద్ర హై స్కూల్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసికంగా ఎదుగుదల ఉంటుందని, ఎంతోమంది క్రీడాకారులు ఉన్నత స్థానంలో ఉన్నారని అన్నారు హ్యాండ్ బాల్ సంఘం అడహక్ కమిటీ చైర్మన్ కోకన్వీనర్ గంగ మోహన్ చక్రు, గట్టడి రాజేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడా అభివృద్ధి అధికారి ముత్తెన్న, తెలంగాణ హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ , తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి రమేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యా సాగర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయ కులు పండిత్ పవన్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలుర విభాగంలో ప్రథమ కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానం, ద్వితీయస్థానం ఆదిలాబాద్ జిల్లా జట్టు, తృతీయ స్థానం నల్గొండ జిల్లా జట్టు, మహబూబ్ నగర్ జిల్లా జట్టు నాలుగవ స్థానంలో నిలిచాయి.



బహుమతులు ప్రదానం చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నిజామాబాద్ నుండే మార్పు మొదలు కావాలి

- పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- భీంగల్‌లో బైక్‌ర్యాలీతో స్వాగతం

నవతెలంగాణ-భీమ్‌గల్

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో అధికారం ఇచ్చేందుకు నిజామాబాద్ జిల్లా నుండే మార్పు మొదలు కావాలని పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భీంగల్ మండలం లింబాద్రి గుట్టకు వచ్చిన అయన శ్రీ లక్ష్మీ నరసింహుని దర్శించుకున్నారు. అనంతరం కొండ కింది ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇవ్వడమే కాంగ్రెస్ పార్టీ చేసిన నేరమా అని ప్రశ్నించారు. తెలంగాణ తెచ్చిన వ్యక్తికి రాష్ట్రాన్ని అప్పగించిన ప్రజలకు పంగనామాలు పెట్టారని, అలాంటి దండుపాల్యెం ముఠాను రాష్ట్రం నుండి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పర్యటించి ఇక్కడి ప్రజల సమస్యలు తెలుకోవడంతో పాటు వాటి పరిష్కారం దిశగా ఆలోచన చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ మేనిపెస్టోలో చేరుస్తామని వెల్లడించారు.

విలువలు లేని ప్రజా ప్రతినిధులు

ఒకప్పుడు నిజామాబాద్ జిల్లా నుండి పని చేసిన నాయకులకు రాష్ట్రంలో మంచి విలువలు ఉండేవని అన్నారు. కానీ నేటి లీడర్లకు ఇసుక దందా, క్వారీల నిర్వహణ, బెదిరింపులు, భూకబ్జాలు లాంటి వాటిని హస్త గతం చేసుకుని దోపిడినే ప్రధానంగా మారిందని ఆరోపించారు. పదవులకు లాలూచిపడి కొందరు నాయకులు పార్టీలు మారి నేడు నీతులు వల్లిస్తున్నారని దుయ్యాబట్టారు. ఇకనైనా ప్రజలు, రైతులు ఆలోచన చేసి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాహేర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, జిల్లా పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు బోదిరే స్వామి, కుంట రమేష్, గోపాల్ నాయక్, నాగేంద్ర బాబు, జేజే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులు సుమారు ఐదు వందల బైక్‌లతో ర్యాలీ నిర్వహించి రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు.